

# భాగ్యనగరం సౌందర్యం బాబూ!

......బి.వి.జగన్మోహన్రావ్

శ్రీపతికి హైదరాబాద్‌లోని ఓ ప్రముఖ కంపెనీలో ఉద్యోగానికి ఇంటర్‌వ్యూ వచ్చింది.

అంతే 'యాహూ' అని ఒక్కసారి ఆనందంపట్టలేక ఎగిరి గంతేయగానే కాలు బెణికింది. అలా కుంటుకుంటూ ఊహల్లో తేలిపోసాగాడు.

హైదరాబాద్‌లో గనక తనకి ఉద్యోగం వస్తే హబ్బ! తనంత అదృష్టవంతుడు వుంటాడా? అందమైన ఆ భాగ్యనగరంలో జీవించడం ఎంతమందికి వీలవుతుంది? ఈ ఉద్యోగం తనకి తప్పకుండా వచ్చేస్తే ఎంత బావుణ్ణు!

శ్రీపతి ఫ్రెండ్ ఆనందరావుకి మూడేళ్ల క్రితమే ఓ ఉద్యోగం వచ్చి హైదరాబాద్‌లో వుంటున్నాడు. లక్కీఫెలో.

తనొస్తున్నట్టు స్టేషన్‌కి రమ్మని ఉత్తరం రాశాడు శ్రీపతి ఆనందరావుకి.

మొట్టమొదటిసారిగా హైదరాబాద్ వెళ్తున్నాడు.

ఉదయం ఏడున్నరకల్లా హైదరాబాద్ చేరుకుంది ఠంచన్‌గా రైలు.

రైల్వేస్టేషన్‌లో ఎక్కడా ఆనందరావు జాడలేదు. అరగంట చూశాడు. కోపంగా బెణికిన కాలును నేలకేసి తన్నాడు. నొప్పితో విలవిల్లాడాక స్టేషన్ బయటికొచ్చాడు.

"ద్వారకాపురి కాలనీ వస్తావా?" బెరుకు కనబడనీయకుండా ఓ ఆటోవాడిని అడిగాడు.

శ్రీపతిని ఓసారి ఎగాదిగా చూసి— "మీటర్‌మీద మూడ్రూపాయలివ్వాలి" అనేసి ఎటో ముఖం పెట్టేశాడు.

"మీటర్‌మీద మూడ్రూపాయలంటాడేంటి"? అనుకుని ఇంకో ఆటోదగ్గరికెళ్లి అడిగాడు.

"ద్వారకాపురి కాలనీయా? ఊహు కుదరదు. చార్మినార్ అయితే వస్తా!" పళ్లికిలిస్తూ చెప్పాడా డ్రైవర్.

"అంటే మనం ఎక్కడికెళ్లాలో వీళ్ల అక్కడికి రారా? వాళ్లెటు తీస్కెళితే అటే వెళ్ళాలా ఇదెక్కడి ఘోరం" అంటూ గట్టిగా జుట్టుపీక్కున్నాడు. గుప్పిటనిండా జుట్టు వూడొచ్చింది. దాన్ని చూసి విరాగ్గా పారేశాడు.

మొత్తమ్మీద ఓ ఆటో ఎక్కేశాడు మీటర్‌పై నాలుగురూపాయలకి.

ఎటు తీసికెళ్తాడో ఏమో అని మనసులో లాగుతోంది.

ఆటో వేగంగా వెళ్తోంది.

ఆశ్చర్యం.

రోడ్డు మీద వెళ్తున్న ఆటోకాస్త సడెన్‌గా గాల్లోకి ఎగిరి అలా రెండు నిమిషాలు వెళ్లాక ధన్‌మంటూ భూమ్మీదికి దిగి వెళ్లసాగింది. ప్రతి రెండు నిమిషాలకి అలా గాల్లో కొద్దిసేపు నడిచి మళ్లీ రోడ్డుపై దిగి జోరుగా పోతోంది.

ముక్కున వేలేసుకున్నాడు శ్రీపతి.

హైదరాబాద్ నగరం. నిజంగా గొప్ప నగరమే అనుకున్నాడు.

అరగంట తర్వాత ఇక్కడే దిగండి అని చెప్పాడు ఆటో డ్రైవర్.

మీటర్ ఛార్జీ పదిహేను ప్లస్ నాల్రూపాయలు ఎక్స్‌ట్రా పందొమ్మిదికి ఇరవైనోటు ఇచ్చాడు శ్రీపతి నోరెళ్లబెడుతూ.

తిరిగి రూపాయి ఇవ్వకుండానే ఆటో స్టార్ట్ చేసుకుని వెళ్లిపోయాడు.

అంతా అయోమయంగా అనిపించింది శ్రీపతికి.

ఆ కాలనీలో ఓ నలుగుర్ని అడిగాడు ఆ ఎడ్రస్. కసితీరా మనసులో ఆనందరావుని తిట్టుకున్నాడు.

చివరికి ఓ మహానుభావుడు పుణ్యం కట్టుకుని వివరంగా మార్గం చూపాడు.

అప్పుడే నిద్రలేచిన ఆనందరావు 'అరెరె! సారీరా శ్రీపతి రాత్రి సెకెండ్‌షో సినిమాకెళ్లాం ఫ్రెండ్సందరం. బాగా లేటవడంతో మెలకువ రాలేదు" అన్నాడు శ్రీపతికి స్వాగతం చెబుతూ.

ఏదో గుర్తొచ్చినట్టు కళ్లు నులుముకుని మరి ఒక్కసారి శ్రీపతిని చూసి "అదేమిటిరా అలా ముసలాడిలా అంతలా వంగిపోయావ్ కొంపదీసి ఆటోలోగానీ వచ్చావా ఏంటి?" సందేహం వెలిబుచ్చాడు ఆనందరావు.

అప్పుడుగానీ తనని తాను చూసుకున్నాడు. అంతే భోరున ఏడ్చినంత పన్జేశాడు శ్రీపతి.

"పొద్దున్నే బానే వున్నాను. ఇదేంటి ఇంతలోనే ఇలా నడుం వంగిపోయింది" బావురుమన్నాడు.

"మా హైదరాబాద్ రోడ్ల మహిమ అది. దారిలో ఆటో హైజంప్‌లు చేసుకుంటూ రాలేదా? రోడ్లనిండా చక్కగా గోతులుంటాయి. కొత్తగా నిన్నవేసిన రోడ్డుని ఇవాళ పొద్దున్న కల్లా డ్రైనేజ్‌వర్కనీ, ఆ వర్కనీ ఈ వర్కనీ తవ్వేస్తారులే. పాపం వాటిని పూడ్చడం వాళ్లకి ఇష్టం వున్నా చెయ్యలేరు. పరిస్థితులు అనుకూలించవ్" అంటూ రూమంతా దద్దరిల్లేలా పడీపడీ నవ్వసాగాడు ఆనందరావు. ఆ వూపుకి పైనున్న రేకులు గాల్లోకి ఓసారి ఎగిరి తిరిగి నాలుగ్గోడలపైనా సెటిలయ్యాయి.

ఓసారి పైకి చూసి తిరిగి చెప్పాడు. "మరి ఇలా గూనివాడిలా వుండాల్సిందేనా?" అని.

"మరేం పర్లేదు మరోసారి ఆటో ఎక్కి ప్రయాణం చేయి అదే ఠక్కున సర్దుకుంటుంది" అని సలహా పారేశాడు ఆనందరావు.

ఆటోవాడికి ఎంతిచ్చిందో తెలుసుకున్న ఆనందరావు, మళ్లీ గట్టిగా నవ్వాడు. మళ్లీ రేకులు లేచి కూర్చున్నాయి.

"స్టేషన్‌నుంచి ఇక్కడికి అయిదుకన్నా ఎక్కువకాదు, నీకు సిటీ అంతా చూపించాడన్నమాట ఆటోవాడు" అని నవ్వుతున్న ఆనందరావుని చూడగానే వెర్రికోపం వచ్చింది శ్రీపతికి.

"వెధవ. స్టేషన్‌కి రాకుండా పైగా జోకులొకటి" తిట్టాడు కోపంగా. వూరంతా తిప్పినా సరయిన చోటే వదిలినందుకు ఆటోవాణ్ణి మనసులో మెచ్చుకున్నాడు.

"సరేగానీ త్వరగా స్నానం కానిచ్చెయ్. అరేసారీ! మర్చేపోయాను. ఇవాళ నీళ్లు లేవు. నిద్రలేవడం ఆలస్యం అయింది కదా!"

"అదేవిటి?"

"పది వాటాలకి కలిపి ఒకే కుళాయి. బాత్రూమ్. లావెట్రీ కూడా ఒకటే. ఆ కుళాయి అరగంట దాటి అరసెకను కూడా రాదు. ఇవాళ స్నానానికి శలవు"గొప్పగా చెప్పాడు.

తలని చేతుల్తో బాదుకున్నాడు శ్రీపతి.

"నీ బాధ నాకు తెలుసులేవోయ్. కొంచెం నీళ్లున్నాయి. ముఖం కడుక్కుని బయల్దేరు. హోటల్‌కెళ్లి టిఫిన్ చేద్దాం"

రేకులు గాల్లోకి ఎగిరి మళ్లీ సెటిలయ్యాయి. అవెగిరినప్పుడల్లా వాటివంక భయంగా చూస్తున్నాడు శ్రీపతి.

ఇద్దరూ బయల్దేరారు.

**ఫుట్‌పాత్‌లమీద ఎవరూ నడవడంలేదు. అందరూ రోడ్డుమీదే నడుస్తున్నారు. ఆ ఫుట్‌పాత్‌లమీద అక్కడక్కడా పళ్లబళ్లూ, ఏవేవో చిన్న చిన్న దుకాణాలున్నాయి. మరి ఫుట్‌పాత్‌లు ఎందుకు...**



దార్లో ఆనందరావు పక్కింటాయన కనిపించాడు. మనిషి చాలా నీర్సంగా వున్నాడు. బట్టలు మాసిపోయి, గడ్డం బాగా పెరిగి వుంది.

"ఏంటి మాస్టారూ! నాల్రోజుల్నుంచి కనిపించడమే లేదు" పలకరించాడు ఆనందరావు.

"ఇదిగో ఈ కిరసనాయిల్ కోసం నాల్రోజులనుంచి క్యూలో నిల్చున్నాను. అరలీటరు దొరికింది ఇంకా పాపం జనం వున్నారు" అంటూ వెళ్లిపోయాడాయన.

శ్రీపతికేసి చూసి నవ్వాడు ఆనందరావు.

ఇబ్బందిగా తనూ నవ్వాడు.

హోటల్లోకెళ్లి కూర్చున్నారు.

సర్వరు నీళ్ల గ్లాసుల్లో ముప్పావువేళ్లు ముంచి శపీమవి టేబిల్ మీద పెట్టాడు.

అప్పడే కడుక్కున్నట్టు తయారయింది శ్రీపతి ముఖం.

ఈసారి చిన్నగా నవ్వాడు ఆనందరావు.

"మాకిలాంటివి పాతే! రుమాలుందా? తుడిచేసుకో" అని సలహా పారేసి టిఫిన్ ఆర్డర్ చేశాడు.

"నీ ఇంటర్వ్యూ రేపు కదా! ఇవాళ, రేపు మా ఆఫీస్‌కి శలవు పారేస్తాలే" అన్నాడు ఆనందరావు.

శ్రీపతి ఇంటర్వ్యూకెళ్లాల్సిన ఆఫీసు లకిడికాపూల్‌లో వుంది. ముందుగా ఓసారి

చూసుకోడానికి అక్కడికి బయల్దేరారు.

రోడ్డు ప్రక్కగా ఇద్దరూ మాట్లాడుకుంటూ నడుస్తున్నారు. ఒక్కసారి ఎందుకో పరికించి చూశాడు. ఫుట్‌పాత్‌లమీద ఎవరూ నడవడంలేదు. అందరూ రోడ్డుమీదే నడుస్తున్నారు. ఆ ఫుట్ పాత్‌లమీద అక్కడక్కడా పళ్లబళ్లూ, ఏవేవో చిన్న చిన్న దుకాణాలున్నాయి. మరీ ఫుట్‌పాత్‌లు ఎందుకు...

ఇంతలో తన మీద ఏదో పడినట్టయితే చూసుకున్నాడు శ్రీపతి.

తెల్లని షర్టుపై ఎర్రగా... కిళ్లీ వూశాడు డబల్‌డెక్కర్ బస్సులో పైనుంచి ఒకడు. ఒక్కసారిగా వళ్లు మండిపోయింది. కానీ ఏం లాభం బస్సు ఎప్పుడో వెళ్లిపోయింది.

ఈసారి శ్రీపతి భుజాలుపట్టి వూపేస్తూ నవ్వాడు ఆనందరావు.

"రోడ్డు పక్క నడుస్తుంటే ఇవి సర్వ సాధారణం. బస్సుల్లో ముఖ్యంగా సీట్లలో కిటికీ పక్కన కూర్చున్నవాళ్లకి మాచెడ్డ సరదా అనుకో! పాన్‌లు వుయ్యడం, కాల్తున్న సిగరెట్‌లు పారెయ్యడం, ముక్కు చీ... ఏవిటనుకున్నావ్ మరి మా హైదరాబాదంటే" చెప్పాడు ఆనందరావు గొప్పగా.

కోపాన్ని ఆపుకోలేక పర్రున చొక్కా చింపుకున్నాడు శ్రీపతి. వెంటనే రూమ్‌కెళ్లి బట్టలు మార్చుకున్నాక బయటకొచ్చారు.

బస్టాప్‌లో జనం అంతగాలేరు. అది దాటాక రోడ్డమ్మట అలా అలా ఒకరి పక్క ఒకరు నిల్చుని వున్నారు. ఏ ఒక్క బస్సూ స్టాప్‌లో ఆగడంలేదు.

"ఇదేవిటీ! ఒక్క బస్సూ ఆగడంలేదు స్టాప్‌లో" ధర్మసందేహం వెలిబుచ్చాడు శ్రీపతి.

"అదంతేలే. ఎక్కడ స్టాప్ వుండునో అక్కడ బస్సులు ఆపబడవు. అలాకొంచెం ముందుకెళ్లి నిలబడదాం. అక్కడ నిల్చున్నవాళ్లంతా బస్సుకోసమే పద" అంటూ దారితీశాడు ఆనందరావు.

పదినిమిషాల తర్వాత ఓ బస్సొచ్చి ఆగింది. కుస్తీపట్లు పడుతున్నట్టు జనం తోసుకుంటున్నారు. దిగేవాళ్లను ఎక్కేవాళ్లు దిగనివ్వడంలేదు.

"బొత్తిగా ఆలోచనలేకుండా ఇదేంటీ! అందరూ దిగాక ఎక్కొచ్చుకదా!" అన్నాడు శ్రీపతి.

"సరెలే! అప్పటివరకూ బస్సాగాలిగా. దిగేవాళ్లే పూర్తిగా దిగకముందే బస్సు బయల్దేరుతుంది. ఇక వాళ్ల ఖర్మ అంతే. ఎక్కడో దిగాలి. ఎవరి తొందరవాళ్లది. వీరాభిమన్యుణ్ణి గుర్తుతెచ్చుకుని దూరిపో" అంటూ ఎంకరేజ్ చేశాడు ఆనందరావు.

బస్సులోకి వచ్చిపడేసరికి శ్రీపతి జుట్టంతా చెదిరిపోయి రెండు షర్టుగుండీలు వూడిపడ్డాయి.

పిచ్చాడిలా ఆనందరావుకేసి చూశాడొకసారి.

"త్వరలోనే ఇక్కడే ఉద్యోగం చేయబోయేవాడివి. ఎక్స్‌పీరియన్స్ కావాలిగా" చెప్పాడు ఆనందరావు.

కాలుపెట్టడానికి కూడా స్థలంలేదు. ఎవరో తన కాలును తొక్కి తొక్కి పెడుతున్నారు. అబ్బా! అమ్మో!

ఆశ్చర్యం. తన నడుం ఈ తొక్కిసలాటలో తిన్నగా అయిపోయింది శ్రీపతికి తెలీకుండానే.

జనసముద్రంలో వీరగా ఈదుతూ వచ్చాడు కండక్టర్.

రూపాయినోటిచ్చి 'రెండు లక్‌డికాపూల్' అని చెప్పాడు ఆనందరావు.

రెండు నలభైపైసల టిక్కెట్లు చేతిలోపెట్టి వెళ్లిపోయాడు కండక్టర్.

"అదేంటీ! ఇంకా ఇరవై పైసలివ్వాలిగా. అలా వెళ్లిపోయాడేంటీ" మళ్లీ శ్రీపతి సందేహం.

"సరే నీ బేతాళ ప్రశ్నలకి విక్రమార్కుడిలా జవాబులు చెప్తునే వుంటాలే. పదిపైసలకి ఇరవై పైసలకి అడిగితే వాడ్నో వెర్రోడిలా చూస్తారు. మనం అడిగితే ఏదో దానం చేస్తున్నట్టు చిరాగ్గా మొహంపెట్టి ఇస్తారు, ఏ కొద్దిమందో తప్ప. అందుకని వూరుకున్నంత ఉత్తమం మరోటిలేదు" ఉపన్యాసంలా చెప్పాడు ఆనందరావు.

ఇంతలో లకిడికాపూల్ వచ్చేసింది.

పావుగంట తిరిగిన తర్వాత "ఇదే రేపు నువ్వు రావాల్సిన ఆఫీసు" అని చూపించాడు.

తర్వాత ఏం చేయాలో తోచక—

"ఏదయినా మ్యాట్నీ సినిమాకి వెళదామా?" అడిగాడు ఆనందరావు.

"అలాగే పద"

మూడు థియేటర్‌లకి వెళ్లారు. మూడింటిలోనూ క్యూల్లో జనం విపరీతంగా వున్నారు. థియేటర్ దాటి అరమైలు వరకూ లైన్లో నిల్చున్నారు. ఆ రోజే ఏవో కొత్త సినిమాలు రిలీజయ్యాయి. లైన్లో వున్న మగవాళ్ల దగ్గర చాపలు, దిళ్లు. ఆడవాళ్లలైన్లో అయితే కుంపట్లు, స్టౌలు గిన్నెలు లాంటివి కనిపించి ఆశ్చర్యపోయాడు.

"ఒరే ఆనందూ! ఏవిట్రా ఇదంతా?"

అర్జునుడికి గీతోపదేశం చేస్తున్న కృష్ణుడిలా ఫోజుపెట్టి చూడ్నాయనా! వీళ్లంతా ఈ సినిమా చూడడానికి వచ్చిన ప్రేక్షకులు బాబూ! ఏ షోకి టిక్కెట్లు దొరికితే ఆ షో చూడడానికి ఈ ఏర్పాట్లు అర్థం అయిందా? అంటే టెంపరరీగా వీరి కాపురాలు ఇక్కడే అన్నమాట?" అన్నాడు.

దగ్గర్లోనే వున్న మరో థియేటర్ వైపు దారితీశారు.

అది నగరంలోని ప్రముఖ థియేటర్‌లలో ఒకటి. ఏదో పాత సినిమా ఆడుతోంది ప్రస్తుతం. ఆ హాల్లో ఏయే సినిమాలు సిల్వర్ జూబిలీలు జరుపుకున్నాయో ఏకరువు పెట్టాడు ఆనందరావు.

అలాగే అయితే లోపల కూడా చాలా బావుండొచ్చు అన్నాడు శ్రీపతి థియేటర్ బయటి అందాన్ని చూస్తూ.

బుకింగ్ క్యూలో వీళ్లిద్దరికన్నా ముందు అయిదారుగురుకన్నా ఎక్కువ లేరు.


"మనకి టిక్కెట్లు దొరుకుతాయంటే నమ్మకం లేదు" అన్నాడు ఆనందరావు.

వెర్రివాడిలా ఓసారి చూశాడు శ్రీపతి.

తాను చూస్తున్న ప్రతిదానికీ ఆనందరావు చెప్పే రీజనింగ్‌లు వింటుంటే తనకి పిచ్చిపడుతున్నట్టనిపించింది శ్రీపతికి.

"అవునూ చూస్తావుగా" అన్నాడు ఆనందరావు.

బుకింగ్ మొదలయిందో లేదో ఎక్కణ్ణుంచి వచ్చారో



### అడ్డులేదు


"ప్రహరీగోడలు అంతంత ఎత్తు కట్టించావ్? దొంగలు పడ్తారనా?" గుర్నాథం అడిగాడు వెంకటప్పయ్యని.

"దొంగలా, నా పిండాకూడా! పెట్టుగోడ మీదుంచి పక్కింటి వాళ్ళతో మా ఆడదాని ఖబుర్లు ఎక్కువైపోతుంటే ఇలా గోడల్ని పెంచి కట్టించా"

"మంచిపనే చేశావ్‌లే!"

"కానేం లాభం? నిచ్చెనేసుకు ఎక్కి మరీ కబుర్లు చెప్పుకుంటోంది" వుసూరుమంటూ చెప్పాడు వెంకటప్పయ్య.

ఆర్.ఎల్.లావణ్య (సికింద్రాబాద్)



గుంపుగా జనం వచ్చి బుకింగ్ కౌంటర్ ముందుదూరారు.

నాయనా ఇక్కడ దౌర్జన్యమయినా వుండాలి. లేదా మనకి అదృష్టమన్నా దండిగా వుండాలి. న్యాయంగా టిక్కెట్లు ఎక్కడో ఎప్పుడో పొరపాటున దొరుకుతాయి అని చెప్పాడు ఆనందరావు.

ఎంత చదువుకున్నా సంస్కారంలేక, పెద్ద సిటీలో వున్నా ఎలా మూవ్ అవాలో తెలీనప్పుడు ఏం లాభం అని వాపోయాడు శ్రీపతి.

ఆనందరావు ఊహించింది సెంట్‌పర్సెంట్ నిజమయింది. సరిగ్గా వాళ్ల దగ్గరికొచ్చేసరికి బుకింగ్ మూసేశాడు. ఆ తర్వాతే వచ్చారు పోలీసులు. ఏమిలాభం.

ఆపైన అలా అలా సిటీ అంతా తిప్పాడు ఆనందరావు. ఇప్పుడు మళ్లీ రోడ్డు ప్రక్కగా గోతులు కనిపించా యి శ్రీపతికి. కడుపు దేవేసేట్టుగా చెత్తకుండీలు. అతని వాలకం చూసి డబ్బాలో రాళ్లేసి ఆడించినట్టు నవ్వాడు ఆనందరావు.

సాయంత్రానికి బిర్లాటెంపుల్ కెళ్లి దాని అందాన్ని చూసి ఎంతో ముచ్చటపడ్డాడు శ్రీపతి. కానీ తృప్తిగా చూడకముందే నడవంటి నడవండి అంటూ తరుముతున్నారు ఆలయ ఉద్యోగులు.

హోటల్‌లో భోంచేసి ఇంటికి చేరారు.

అప్పుడు పరిశీలనగా చూశాడు గదిని.

“ఒరేయ్! ఈ అగ్గిపెట్టికి అద్దెంత?” అడిగాడు ఆనందరావుని.

అతనికి ఆనందరావు ముఖం కన్పించలేదు. కేవలం పెద్ద క్వశ్చన్‌మార్క్ వుంది.

“అబ్బ! అదేరా! ఈ రేకుల షెడ్డుకి అద్దె ఎంత” విసుక్కున్నాడు శ్రీపతి.

విషయం అర్థం అయిన ఆనందరావు గట్టిగా నవ్వాడు. పైన రేకులు ఎగిరాయి. మళ్లీ యధాస్థానంలో పడ్డాయి.

“దీనికా! నూటాయాభై” చెప్పాడు.

ధబ్‌మన్న శబ్దం వినిపించి చుట్టూ చూశాడు. నేలమీద స్పృహతప్పి పడివున్న శ్రీపతిని చూసి నీళ్లుచల్లి లేపాడు.

'ఏవయింది'

“అబ్బే! ఏంలేదు. అద్దెవింటేనూ. వేరే మంచి గది చూస్కోకూడదూ” చెప్పాడు శ్రీపతి.

“ఇక్కడ ఇల్లు సంపాదించడమంటే ఏదో చంద్రమండలానికెళ్లినంత తేలికనుకుంటున్నావా? పైగా నాలాంటి బ్రహ్మచారికి మరీకష్టం. ఇది ఒక విధంగా చాలా చవక. మా కొలీగ్ ఒకడు ఇంతే గదికి రెండొందలేభై ఇస్తున్నాడు తెలుసా? అందునా ఆ గదికి కరెంట్ కూడా లేదు”

అలాగే చూస్తుండిపోయాడు శ్రీపతి.

“సరేగానీ పడుకో రేపేకదా ఇంటర్‌వ్యూ పొద్దున్నే త్వరగా లేవాలి” అంటూ నిద్రకుపక్రమించాడు ఆనందరావు.

“లైటార్పవా?” అడిగాడు శ్రీపతి.

“పదిగంటలు కాగానే అదే ఆరిపోతుంది”

“అదెలా!”

“అవును రాత్రి పదింటికల్లా ఇంటోనరు మెయిన్ తీసేస్తాడులే” తాపీగా చెప్పాడు ఆనందరావు.

రెండు నిమిషాలయ్యాక “ఒరేయ్ ఆ ట్రాన్సిస్టర్ ఆపుచేసినట్లు లేదు. ఏదో మ్యూజిక్ వస్తోంది” అన్నాడు శ్రీపతి పొడుగుచాలని ఆ గదిలో గోడకి కాళ్లు ఆనించి 'ఎల్' ఆకారంలో నిద్రపోతూ

“మ్యూజిక్కూ కాదూ నా మొహమూ కాదు అది దోమల సంగీతంలే. చక్కగా ముసుగుదన్ని పడుకోరా! నాకు నిద్దరొస్తోంది గుడ్‌నైట్” అనేసి నిద్రలోకి జారుకున్నాడు ఆనందరావు.

ఓసారి పైన రేకులకేసి భయంగా చూసి తనూ నిద్రపోయాడు శ్రీపతి.

పొద్దున్న నిద్రలేవగానే ఓ పావుగంటపాటు 'ఎల్' ఆకారంలో అలాగే వుండిపోయాడు శ్రీపతి. ఆనందరావుకి అలవాటయి పోయింది కాబట్టి మామూలుగానే వున్నాడు.

ఇంటర్‌వ్యూకి వెళ్లాడు. బాగానే అనిపించింది. ఆ తరువాత అక్కడ వోచర్‌మీద సంతకం చేసి రైలు ఛార్జీలు తీసుకున్నాడు. ఆ సాయంత్రమే వెళ్లిపోడానికి నిశ్చయించుకున్నాడు ఇక్కడ ఒక్క క్షణం వుండబుద్ధి కావడంలేదు శ్రీపతికి.

“నీకీ ఉద్యోగం తప్పకుండా వస్తుందిలే” అన్నాడు ఆనందరావు.

ఎందుకో ఆ మాటలు శ్రీపతికి నచ్చలేదు.

అతను వెళ్లిపోయిన పదిహేను రోజులకి ఇంటర్‌వ్యూలో సెలెక్ట్ అయినట్టు వెంటనే జాయినవమని లెటరొచ్చింది. కానీ శ్రీపతికి హైదరాబాద్‌లో ఉద్యోగం చేయడం ఇప్పుడు బొత్తిగా ఇష్టం లేదు. అందుకే ఆ కాగితాన్ని కసికొద్దీ పరపరా చించేశాడు. జన్మలో అసలు హైదరాబాదే వెళ్లకూడదని నిర్ణయించుకున్నాడు. *

